ఆవిష్కరణలు అద్భుతం



ఆరిలోవ స్కూల్‌లో భగవద్గీత శ్లోకాలతో వైజ్ఞానిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



బీచ్ రోడ్డులోని ఎంఎల్‌బీటీ పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- విద్యాలయాల్లో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం
- సైన్స్ ప్రాజెక్టులతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఆరిలోవ: స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి సంతపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను పలువురు శాస్త్రవేత్తల వేషధారణలో సిద్ధం చేశారు. ముజామ్మిల్ అనే విద్యార్థికి సర్ సి.వి.రామన్ వేషధారణ వేసి చంద్రయాన్ వర్కింగ్ మోడల్ రూపొందించారు. విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్, శాస్త్రవేత్తలు, సైన్స్ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద ఉషోదయా స్కూల్‌లో వినూత్నంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు సనాతన ధర్మం, భగవద్గీత శ్లోకాలను జత చేసి వైజ్ఞానిక ప్రదర్శన చేశారు. సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆహార పదార్థాలు, పండ్లు, ఆహారపు అలవాట్లకు సంబంధించిన సమాచారాన్ని ప్రదర్శించారు. పాఠశాల కరెస్పాండెంట్ భాస్కరరావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కగా బోధించాలి

విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కగా బోధించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు సూచించారు. పదో వార్డు ఆదర్శనగర్‌లోని శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను ఆయన తిలకించారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు పరిశీలించారు. పలువురు శాస్త్రవేత్తల చిత్రపటాలు, వారి జీవిత చరిత్రలు, వారు పరిశోధనలు చేసి కనుగొన్న అంశాలను చదివి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కలిగించడానికి ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మంచి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలన్నారు. మంచి విద్యా బోధన ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తుందని సూచించారు. శాస్త్రవేత్తలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉమెన్ శాస్త్రవేత్త రజనీ విలియమ్స్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్.. సూపర్

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలోని రోజరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. వాటి వివరాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రామస్వామి మాట్లాడుతూ నేషనల్ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రశంసించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోండి

ఎంవీపీకాలనీ: విద్యార్థి దశలోనే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఎంవీపీ కాలనీ కిడ్జ్‌గార్డెన్ స్కూల్‌లో నిర్వహించిన జాతీయ సైన్స్ డే వేడుకల్లో ఏయూ డీన్ ఆచార్య ఈశ్వరకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజ్ఞానిక విజ్ఞానంతో యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఆచార్య ఈశ్వరకుమార్ మాట్లాడుతూ సర్ సి.వి.రామన్ స్ఫూర్తితో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు. ఆసక్తికరమైన ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకుని, విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

శాస్త్రీయ జ్ఞానంతో ఎంతో విజ్ఞానం

ఎంవీపీకాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ వికసిత్ భారత్' అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి ముఖ్య అతిథి ఏయూ ఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో యువత ప్రతి అంశాన్ని శాస్త్రీయ జ్ఞానంతో చూడాలన్నారు. తద్వారా అనేక ప్రశ్నలు, వాటికి లభించే సమాధానాల ద్వారా ఎంతో విజ్ఞానాన్ని అందిపుచ్చుకోగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సత్కరించారు. ఆచార్య ప్రగడ రాజగణపతి, ప్రిన్సిపాల్ ఆచార్య బోస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని జీవీఎంసీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులు వందకు పైగా సైన్స్ మోడళ్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయిని కె.మధురవాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాలను పెంపొందించడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శను విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు.

నూతన ఆవిష్కరణలకు సిద్ధం కండి

విశాఖ విద్య: విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు సిద్ధం కావాలని ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పిలుపునిచ్చారు. వర్సిటీ విద్యా విభాగంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విభాగం ఆచార్యులతో కలసి సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షారోన్ రాజు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ దేశంలోని ప్రతి పరిశోధకుడికి దిక్సూచిగా నిలిచిందన్నారు. ఏయూలో పరిశోధనలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగరాజకుమారి, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

- ఏయూ ఇన్‌స్టిట్యూట్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ) ప్రాంగణంలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్, సెమినార్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజకుమారి మాట్లాడుతూ మన దేశ శాస్త్రవేత్తల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అధ్యాపక బృందం, బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు. వర్సిటీ విద్యా విభాగంలోనూ సైన్స్ డే వేడుకలు నిర్వహించారు.



సంతపాలెం పాఠశాలలో సి.వి.రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆదర్శనగర్ స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న మాజీ డీజీపీ సాంబశివరావు



పాత వెంకోజీపాలెం స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులు తిలకిస్తున్న టీచర్లు, విద్యార్థులు



ఎంవీపీ స్కూల్‌లో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఆచార్య ఈశ్వరకుమార్



ఏయూలో సి.వి.రామన్‌కు నివాళులర్పిస్తున్న ఆచార్య షారోన్ రాజు తదితరులు

ఆలోచనల నుంచి ఆవిష్కరణల దిశగా..

ఏయూక్యాంపస్: చిన్నతనంలో పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలు, నిత్యం సమాజంలో జరుగుతున్న సంఘటనలు.. నేటి తరం విద్యార్థుల మస్తిష్కాల్లో ఉద్భవించే నూతన ఆలోచనలు.. వాటిని ఆచరణలో పెడితే సరికొత్త ఆవిష్కరణలుగా నిలుస్తాయి. జాతీయ సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో జరిగిన సైన్స్ ప్రయోగాల ప్రదర్శనకు తన సైన్స్ ప్రాజెక్టును తీసుకెళ్లి తిరిగి ఇంటికి వస్తూ మురిసిపోయింది ఈ విద్యార్థిని. పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి.



– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దీపం పథకం అమల్లో మరింత అప్రమత్తంగా ఉంటాం

సీఎస్‌కు తెలియజేసిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దీపం–2 పథకం అమల్లో మరింత అప్రమత్తంగా ఉంటామని, సబ్సిడీ నగదు వెనువెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులపై సమీక్షించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి కలెక్టర్ వివరించారు. దీపం పథకం ద్వారా అర్హులైన అందరికీ సకాలంలో రాయితీ నగదు జమ చేస్తున్నామని, అక్కడక్కడా తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, దానికి తగిన కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు నిమిత్తం అవసరమైన భూములను గుర్తిస్తామని, సర్వేను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ఆహారం, తాగునీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హామీలను గాలికొదిలేశారు..



పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని, ఈ బడ్జెట్‌తో తేటతెల్లమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి రూ.25 వేల కోట్ల బడ్జెట్ అవసరముంటే కేవలం రూ.9,400 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. కోటీ 55 లక్షల మంది దీపం లబ్ధిదారులను 90 లక్షలకు కుదించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీకి రుణమిస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్‌లో ఆ ప్రస్తావన కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవి బడ్జెట్‌లో కానరాలేదన్నారు. గాలి బడ్జెట్‌ను గొప్ప బడ్జెట్‌గా కీర్తిస్తున్న కూటమి నేతలు ఊహల నుంచి వాస్తవాల్లోకి రావాలని హితవు పలికారు.

క్లుప్తంగా

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ



వంటపాత్రలు అందజేస్తున్న దాతలు

ఆరిలోవ: ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి దాతలు శుక్రవారం వంట సామగ్రి అందజేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కడియం శ్రీను, ఆయన భార్య సత్యమాధవి ఇక్కడ హోంకు అవసరమైన ఎలక్ట్రికల్ కుక్కర్, ఇడ్లీ పాత్రలు, వివిధ స్టీల్ సామగ్రితోపాటు చాపలు, వాటర్ బాటిళ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆశ్రమ స్వామీజీ ఆచార్య సౌమ్యానంద్ అవదూత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టైలర్లను ఆదుకోండి



టైలర్స్ డేలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: జిల్లా ప్రైమరీ టైలర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీ పార్క్‌లో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సిహెచ్.రామారావు మాట్లాడుతూ దర్జీల కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయన్నారు. ఆధునిక సాంకేతికత కారణంగా అంతంత మాత్రమే ఉపాధి లభిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలోని టైలర్లందరినీ ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. టైలర్స్ ఫెడరేషన్ నెలకొల్పడం ద్వారా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీతోపాటు 200 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ కల్పించాలని, ఇన్సురెన్స్ అమలు చేయాలని, గతంలో టైలర్ల సంక్షేమానికి రూపొందించిన జీవోను పునరుద్ధరించాలని కోరారు. సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా గంగాకుమార్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా గంగాకుమార్ చక్రవర్తుల నియమితుడయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ హైకోర్టులో ఏయూ తరఫున మూడేళ్ల పాటు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఆయన కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఐఐ విశాఖ చైర్మన్‌గా నారాయణరాజు



చైర్మన్ నారాయణ



వైస్ చైర్మన్ కృష్ణమోహన్

బీచ్‌రోడ్డు: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖపట్నం జోన్ చైర్మన్‌గా డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వి.ఎస్.నారాయణ రాజు నామినేట్ అయ్యారు. వైస్ చైర్మన్‌గా ఇన్‌స్పైర్డ్ ఐటీ సొల్యూషన్స్ ఎండీ జి.కృష్ణమోహన్ ఎన్నికయ్యారు. నగరంలోని ఒక హోటల్‌లో శుక్రవారం వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ ప్రకటించారు.

రూ.200 కోట్లతో 15 రహదారుల నిర్మాణం

బీచ్‌రోడ్డు: ఈ ఏడాది కాలంలో రూ.200 కోట్ల పెట్టుబడులతో 15 రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సీఐఐ వార్షిక సమావేశంలో భాగంగా స్వర్ణాంధ్ర విజన్–2029 విశాఖపట్నం ప్రాంత వృద్ధి అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి అజెండాలో విశాఖ వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని వివరించారు. నీతి ఆయోగ్ సహకారంతో అభివృద్ధి చేసిన గ్రోత్ హబ్ భావనకు అనుగుణంగా విశాఖ నగరం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలోపే రద్దీని తగ్గించే ప్రణాళికలను రూపొందించామన్నారు. నీటి కొరత లేకుండా పురాతన నీటి వనరులను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. నీతి ఆయోగ్‌లోని పీపీపీ, ఐలాండ్ ప్రోగ్రాం డైరెక్టర్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పొడవైన తీరప్రాంతం ఉండటం వల్ల పరిశ్రమలకు లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గుతాయన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ 500 ఎకరాల డేటా సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా ఏఐ ప్రతిభకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా విశాఖను తీర్చిదిద్దేందుకు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎర్నెస్ట్ డైరెక్టర్ అమిత్ మజుందార్, సీఐఐ విశాఖ చైర్మన్ రాజేష్ గ్రంధి తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ ప్రగతి చోదకాలపై సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న అధికారులు

ఏయూక్యాంపస్: నీతి ఆయోగ్ ప్రగతి చోదకాలపై శుక్రవారం సమీక్ష జరిగింది. వీఎంఆర్డీఏ కమిషనర్, నీతి ఆయోగ్ నోడల్ అధికారి కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్(వీఈఆర్) పరిధిలో ఉన్న పరిస్థితులను సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజుతో కలిసి సమీక్ష చేశారు. అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు వర్చువల్ విధానంలో పాల్గొని విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నీతి ఆయోగ్ పథక సంచాలకులు పార్థసారధి, నీతి ఆయోగ్ విశిష్ట సహచరుడు(డిస్టింగ్విష్డ్ ఫెలో) కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతదే భవిష్యత్ ప్రపంచం



జ్యోతి వెలిగించి మేనేజ్‌మెంట్ మీట్‌ను ప్రారంభిస్తున్న శ్రీధర్ తదితరులు

ఎంవీపీకాలనీ: భవిష్యత్ ప్రపంచం ఆధునిక సాంకేతికతదేనని జింథే టెక్నాలజీ వ్యవస్థాపకుడు శ్రీధర్ పానుగంటి అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం) ఆధ్వర్యంలో శుక్రవారం 'పినాకిల్–2025' మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌తో పాటు ఎస్ఏఎస్ టెక్నాలజీస్ సీఈవో చమన్ బయిడ్ లు మాట్లాడుతూ అంతర్జాతీయంగా నూతన సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. దాన్ని ముందుగానే ఒడిసిపట్టడం ద్వారా యువత అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఐఐఏఎం డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ ఐఐఏఎంకు చెందిన 500 మంది విద్యార్థులతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి 250 మంది విద్యార్థులు పినాకిల్–2025కి హాజరు కావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే రెండు రోజుల మేనేజ్‌మెంట్ మీట్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసివేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతిక్షణం అప్రమత్తతతో ఉంటూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనుజుతో సెల్ఫీలు



జూ బాహ్య ప్రపంచంలో తిరిగే కనుజుతో సెల్ఫీ తీసుకుంటున్న యువకులు

ఆరిలోవ: జూ పార్కు ఎన్‌క్లోజర్లలోని వన్యప్రాణులు సందర్శకులను అలరిస్తుంటాయి. వాటితో పాటు కొన్నిసార్లు జూ లోపల కొండలపై విచ్చలవిడిగా తిరిగే చుక్కల జింకలు, కనుజులు సందర్శకులకు కనువిందు చేస్తుంటాయి. రెండు రోజులుగా జూలో ఓ కనుజు క్యాంటీన్ పరిసరాల్లో సందర్శకుల చెంతకు వచ్చి ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేస్తోంది. కనుజుతో సందర్శకులు, యువకులు సెల్ఫీలు తీసుకుని ఎంజాయ్ చేశారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్‌ఎంకు బెయిల్



సౌరభ్ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబైలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. హిందుస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్‌హ్యాండెడ్‌గా ఆయన దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబై) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు కూడా తీసుకున్న నేపథ్యంలో.. సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్ ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.